ప్రజాశక్తి
ఆదివారం 29 సెప్టెంబర్ 2024 5 కర్నూలు





రాష్ట్ర హైకోర్టు జడ్జి మన్మథరావును కలిసిన కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్‌పి జి.బిందు మాధవ్

హైకోర్టు జడ్జిని కలిసిన కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు లీగల్

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి అండ్ అడ్మినిస్ట్రేటివ్ జడ్జి ఆఫ్ కర్నూలు జ్యుడిషియల్ డిస్ట్రిక్ట్ (కర్నూలు, నంద్యాల) డాక్టర్ జస్టిస్ కె.మన్మథరావును జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ది, కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్‌పి జి.బిందు మాధవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. కర్నూలు డిస్ట్రిక్ట్ కోర్టు కాంప్లెక్స్‌లో జరగనున్న డిస్ట్రిక్ట్ జ్యుడిషియల్ ఆఫీసర్స్‌వర్క్‌షాప్‌లో, అదే విధంగా ఈ నెల 29న జరగనున్న డిస్ట్రిక్ట్ లెవెల్ జ్యుడిషియల్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్ కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లాకు ఆయన వచ్చారు. హైకోర్టు న్యాయమూర్తికి పూలబొకే ఇచ్చి స్వాగతం పలికారు.

రెవెన్యూలో బదిలీల లొల్లి

- నేతల సిఫార్సులకు దిక్కేది - పాత వారికే కీలక మండలాల కేటాయింపు - కలెక్టర్ తీరుపై నేతల అసంతృప్తి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో రెవెన్యూ శాఖలో ఉన్నతాధికారి తీరుపై అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తాము సూచించిన వారిని కాకుండా వేరే వారిని నియమించడం పట్ల మండిపడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పనిచేసిన వారికే కీలకమైన స్థానాలను కేటాయించడం పట్ల కూడా నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో రెవెన్యూ శాఖలో జరిగిన బదిలీలపై అధికార పార్టీ ప్రజాప్రతినిధులు పెదవి విరుస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక తమ పనులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు అధికారులను నియమించుకున్నందుకు కొంతమంది ప్రజా ప్రతినిధులు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా మండలాలకు తహశీల్దారుల నియామకాలతో పాటు ఆర్ఐ, విఆర్‌ఒల నియామకాలకు సంబంధించి వారి అనుకూలమైన పేర్లను సిఫార్సు చేశారు. ఈ సిఫార్సు లేఖలన్నిటిని ప్రజాప్రతినిధులు నేరుగా జిల్లా కలెక్టరుకు పంపారు. ఇటీవల నిర్వహించిన తహశీల్దార్ల, ఆర్ఐ, విఆర్‌ఒల బదిలీలలో అనేకమంది ప్రజాప్రతినిధులు సిఫార్సు చేసిన వారికి స్థానాలను కేటాయించలేదు.

రెవిన్యూ బదిలీలన్నీ కలెక్టర్ పర్యవేక్షణ

జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదనరావు గత కొన్ని రోజులుగా సెలవులో వెళ్లారు. ప్రస్తుతం ఆయన స్థానంలో ఇన్చార్జి డిఆర్‌ఓగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవిని జిల్లా కలెక్టర్ నియమించారు. రెవెన్యూ శాఖలో జరిగిన బదిలీలన్నిటిని జిల్లా కలెక్టర్ స్వయంగా పర్యవేక్షణలోనే నిర్వహించినట్లు తెలిసింది. జిల్లా కలెక్టర్ నేరుగా బదిలీలకు సంబంధించిన జాబితా దస్త్రాలను తెప్పించుకొని ఆయనే స్థానాలను కేటాయించారు. గత ప్రభుత్వ హయాంలో కీలకంగా వ్యవహరించిన తహశీల్దారులకు మళ్లీ కీలకమైన మండలాలను కేటాయించడం పట్ల కూడా ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓర్వకల్ తహశీల్దార్ విద్యాసాగర్ గతంలో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి నియోజకవర్గంలోని బేతంచెర్ల ,డోన్ మండలాల్లో పనిచేశారు. కర్నూలు రూరల్ తహశీల్దార్ రమేష్ బాబు గతంలో కల్లూరు మండలంలో అత్యధిక కాలం పనిచేశారు. ఆయన హయాంలో పెద్ద ఎత్తున భూ ఆక్రమణలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు మరోసారి క్రియాశీలక మండలాన్ని కేటాయించారు. కోడుమూరు తహశీల్దార్ వెంకటేష్ నాయక్ గత ప్రభుత్వ హయాంలో కర్నూలు రూరల్,దేవనకొండ మండలాల్లో పని చేశారు. ఆయన హయాంలో కర్నూలు రూరల్ మండలంలోని గార్గేయపురం గ్రామంలోని ప్రభుత్వ భూములను పెద్ద ఎత్తున కబ్జాకు గురి చేశారు. కొంతమంది రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లారు. ఇందులో అటవీ శాఖకు సంబంధించిన భూములను ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారికి బదలాయించినట్లు కూడా ప్రభుత్వ పెద్దలదృష్టికి తీసుకెళ్లారు.ఇలా అనేకమంది తహశీల్దార్లపై అవినీతి ఆరోపణలు ఉన్నప్పటికీ కీలకమైన మండలాలను కేటాయించడం పట్ల అధికార పార్టీ నేతలే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే విఆర్‌ఒలను కూడా అదే విధంగానే బదిలీలను చేపట్టినట్లు మండి పడుతున్నారు.

హమాలీల కూలి రేట్లు పెంచాలి

- జెసికి సివిల్ సప్లయిస్ హమాలీ యూనియన్ వినతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ గోడౌన్‌లో పనిచేసే హమాలీల కూలి రేట్లు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఎపి సివిల్ సప్లయిస్ హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ బి.నవ్యకు సివిల్ సప్లయిస్ హమాలీ యూనియన్ ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర అధ్యక్షులు ఆర్ కృష్ణతో పాటు జిల్లా కార్యదర్శి బజారి, నాయకులు చంద్రులు ఉన్నారు. వారు మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా ప్రస్తుతం అమలు చేస్తున్న కూలీరేట్ల ఒప్పందం గత ఏడాది డిసెంబర్ నాటికే ముగిసిందని అన్నారు. క్వింటాళుకు రూ. 25 నుండి రూ.40 పెంచాలన్నారు. హమాలీలందరికీ దసరా బోనస్ కూడా ఇవ్వాలని కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఫుట్ బాల్‌కు మంచి క్రేజీ

- నేటి నుంచి అక్టోబర్ 2 వరకు బాలుర ఫుట్ బాల్ టోర్నీ

- జివి.మోహన్ కుమార్, రవీంద్ర విద్యా సంస్థల ఛైర్మన్

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

రిడ్జ్ స్కూల్ అధ్వర్యంలో సిబిఎస్ఇ క్లస్టర్ -7 ఇంటర్ స్కూల్ బాలుర ఫుట్ బాల్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామని, ఈ పోటీలలో ఎపి, తెలంగాణ నుంచి 150 స్కూల్స్ పాల్గొంటున్నాయని, దాదాపు 3 వేల మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొంటున్నారని రవీంద్ర విద్యా సంస్థల చైర్మన్ జివి. మోహన్ కుమార్ తెలిపారు. శనివారం కర్నూలు అబ్బాస్ నగర్‌లోని రవీంద్ర పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ ఫుట్ బాల్ పోటీలు లక్ష్మీపురం సమీపంలో ఉన్న రిడ్జ్ స్కూల్ లో జరుగుతాయని, ఇందు కోసం 3 గ్రౌండ్లను సిద్ధం చేశామన్నారు. ఈనెల 29 నుంచి అక్టోబర్ 2 వరకు జరిగే ఈ పోటీలలో పాల్గొనే విద్యార్థులకు అన్ని వసతులూ ఏర్పాటు చేశామన్నారు. మొదటి రోజు పోటీల ప్రారంభోత్సవంలో కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు పాల్గొంటారని, మంత్రి టిజి.భరత్, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి లతో పాటు డిఇఒ సామ్యేలు , జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతి రావు, రవీంద్ర విద్యా సంస్థల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య ముఖ్య అతిధులుగా పాల్గొని పోటీలను ప్రారంభిస్తారన్నారు. రిడ్జ్ స్కూలు సిఇఒ గోపి మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు అన్ని వసతులూ ఏర్పాటు చేశామని, ఇప్పటికే 20 టీమ్స్ వచ్చాయన్నారు. రవీంద్ర గ్లోబల్ స్కూల్ సిఇఒ వంశీధర్ మాట్లాడుతూ విద్యతో పాటు తమ పాఠశాలలు క్రీడలకు కూడా ప్రాముఖ్యత ఇస్తుందని, ప్రతి యేటా విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తున్నామన్నారు. సమావేశంలో ప్రిన్సిపల్ రాజ్ కమల్, డీన్ కం ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజేంద్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవీంద్ర విద్యాసంస్థల ఛైర్మన్ మోహన్ కుమార్

బది'లీలలు'..!

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

అందరూ అనుకున్నట్లుగానే కూటమి ప్రభుత్వం బదిలీల ప్రక్రియలో తన మార్కును ప్రదర్శించింది. బదిలీల్లో నాయకులు లీలలు చేశారు. కూటమిలోని ప్రజాప్రతినిధులు సిఫార్సులు చేసిన వారికే కీలక శాఖలోని ఉద్యోగుల బదిలీలు చేశారు. తమ పనులను చక్కదిద్దే వారిని మాత్రమే ఈ బదిలీల్లో ప్రజాప్రతినిధులు సిఫార్సు చేయించుకుని వేసుకున్నారు. రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రెండున్నర నెలల తర్వాత సాధారణ ఉద్యోగుల బదిలీలకు చర్యలు తీసుకుంది. విద్య, వైద్య, ఆరోగ్య శాఖలను మినహాయించి అన్ని శాఖల్లో బదిలీలను చేపట్టింది. ఇందులో ఐదేళ్ళు పూర్తి చేసుకున్న ఉద్యోగులను తప్పనిసరిగా బదిలీ చేసింది. ఇందులో భాగంగా రెవెన్యూ, పంచాయతీ రాజ్, తాగునీటి సరఫరా వంటి కీలక శాఖలో ప్రజాప్రతినిధులు సిఫార్సు చేసిన వారిని బదిలీ చేశారు. పంచాయతీ రాజ్ విభాగంలో పంచాయతీ కార్యదర్శుల నియామకాలు మొత్తం అధికార పార్టీ నేతల సిఫార్సు లేఖల ఆధారంగానే పూర్తి చేశారు. ఎంపిడిఒలను కూడా తమ అనుకూలమైన వారిని ఆయా మండలాలకు ప్రజాప్రతినిధులు వేయించుకున్నారు. రెవెన్యూ శాఖలో తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లతో పాటు విఆర్‌ఒల బదిలీలు మొత్తం అధికార పార్టీ ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే సాగాయి. మండలాల తహశీల్దార్ల నియామకంలో గతంలో ఆ మండలంలో పని చేసిన వారిని కాకుండా కొత్త వారిని తెచ్చుకొని తమ పనులను పూర్తి చేసుకున్నందుకు బదిలీ చేయించుకున్నారు. అలాగే గ్రామాల్లో విఆర్‌ఒల బదిలీలు కూడా వారికి అనుకూలమైన వారిని నియమించుకున్నారు. డిఆర్‌డిఎ, డ్వామా వంటి శాఖల్లో కూడా బదిలీల ప్రక్రియను చేశారు. ఉపాధి హామీ చట్టం అమలుతో పాటు పొదుపు సంఘాల మహిళల వంటి అంశాలు ముడిపడి ఉండడంతో ఇక్కడ కూడా అనేక మందిని కొత్తవారిని నియమించారు.

హైకోర్టు బెంచ్‌కు అడుగులు : కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటన చేశారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు కోసం మంత్రివర్గ సమావేశంలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. అమరావతిలో హైకోర్టు కొనసాగుతూనే హైకోర్టు బెంచ్ కర్నూలులో అందుబాటులోకి రానుంది. గతంలో అధికారంలో ఉన్న జగన్మోహన్ రెడ్డి కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటు చేస్తామని, హైకోర్టు కర్నూలుకు తరలిస్తామని పలు సార్లు ప్రకటనలు చేశారు. కర్నూలులో హైకోర్టు ఏర్పాటుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి ప్రతిపాదనలూ పంపలేదు. చంద్రబాబు నాయుడు ప్రతిపక్షంలో ఉన్న సమయంలో కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని ప్రకటన చేశారు. ఆ నేపథ్యంలో కర్నూలుకు వచ్చిన చంద్రబాబు నాయుడును వైసిపి నాయకులు అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. కర్నూలు జిల్లాలో యువగళం పాదయాత్ర చేపట్టిన సందర్భంగా టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కూడా కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ హామీల మేరకు టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై ప్రకటన చేశారు. దీనిని కర్నూలు న్యాయవాదులు స్వాగతిస్తున్నారు. వీలైనంత త్వరగా కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

విద్యా రంగ పరిరక్షణకు : విద్యా రంగ పరిరక్షణ కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఉన్నత విద్యకు శాపంగా మారిన జిఒ 77ను ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని కోరారు. మెడికల్ విద్యను ప్రభుత్వమే కొనసాగించి 107, 108 జిఒలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలను విడుదల చేయాలని కోరారు. కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

అవీ..ఇవీ..అన్నీ..

కార్మికులను కట్టు బానిసలుగా చేసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా నిర్వహించారు. పాత కార్మిక చట్టాలైన 44 చట్టాలను మారుస్తూ నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకురావడం వల్ల కార్మికులకు చాలా ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభలు నిర్వహించారు. ఆయనకు ఘన నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. జిల్లా వ్యాప్తంగా మహాకవి గురజాడ అప్పారావు 162వ జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. అధికారులు, ప్రజా సంఘాల నాయకులు ఆయనకు నివాళులర్పించారు. జిల్లా వ్యాప్తంగా ఇది మంచి ప్రభుత్వం, స్వచ్ఛత హి సేవ కార్యక్రమాలను నిర్వహించారు.



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాషువా జయంతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలోని స్థానిక డాక్టర్స్ కాలనీలో ఉన్న ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో శనివారం గుర్రంజాషువా జయంతి కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరాశాంతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ కవి, రచయిత సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ హాజరయ్యారు. ముందుగా జాషువా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం కెంగారం మోహన్ మాట్లాడుతూ గుర్రం జాషువా దేశం గర్వించదగిన గొప్పకవి అని తెలపారు. విద్యార్థులు జాషువా రచనలు చదవాలని తెలిపారు. జాషువ వర్ణవ్యవస్థపై తిరుగుబాటు చేశారని, కులమతాలకు అతీతమైన విశ్వనర తత్త్వం అలవర్చుకున్నారన్నారు. విద్యార్థులు గబ్బిలం, పిరదౌసి వంటి కావ్యాలను అధ్యయనం చేయాలన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ జె. హేమంత్, ఏ సత్యనారాయణ, డాక్టర్ ఫక్రున్నిసా బేగం, డాక్టర్ వింధ్యావాసినిదేవి, రామదాసరి వై. శ్రీనిరాస్ రెడ్డి, సోమశేఖర్ ఇతర అధ్యాపక, అధ్యాపకేతర బృందం విద్యారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కెంగార మోహన్



సూర్జిత్ భవన్‌లో భగత్ సింగ్ జయంతి సభలో నివాళి అర్పిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

భగత్ సింగ్ స్ఫూర్తితో మతోన్మాదంపై పోరాటం

జయంతి సభలో డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

యువకులు, విద్యార్థులు శాస్త్రీయ విద్యావిధానం కోసం, శాస్త్రీయబద్ధంగా బతకడం కోసం మతఉన్మాదానికి వ్యతిరేకంగా పోరాడినప్పుడే భగత్ సింగుకు నిజమైన నివాళి అని డివైఎఫ్ఐ నాయకులు తెలిపారు. భగత్ సింగ్ 117వ జయంతి కార్యక్రమాన్ని డివైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి నగేష్ అధ్యక్షతన నిర్వహించారు. కర్నూలు సూర్జిత్ భవన్‌లో డివైఎఫ్ఐ ఓల్డ్ సిటీ అధ్యక్షులు నాయుడు అధ్యక్షతన నిర్వహించారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, జిల్లా మాజీ కార్యదర్శి అంజిబాబు, జిల్లా మాజీ అధ్యక్షులు రాముడు మాట్లాడుతూ 1907 ఈనెల 28న లాయల్పూర్‌జిల్లా బంగాలో గ్రామంలో జన్మించిన భగత్ సింగ్ లాల లజపతిరాయి, మహాత్మా గాంధీ పిలుపులను అందుకొని భారత స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్నారని తెలిపారు. ఏడేళ్ల వయసులో గద్దర్ వీరుడైన కత్తర్‌సింగ్‌ను బ్రిటీష్ పోలీసులు అరెస్టు చేస్తే వాళ్ల చిన్నమ్మకు ధైర్యం చెప్పాడన్నారు. తమ పెరట్లో తుపాకులు నాటితే అవి పెరిగి భారీగా తుపాకులు కాస్తాయి వాటి ద్వారా బ్రిటీష్ సామ్రాజ్యవాదులను తరిమి కొట్టొచ్చు కదా అని తన తండ్రికి తెలిపిన వ్యక్తి అని అన్నారు. నేడు భగత్ సింగ్ కోరుకున్న సమ సమాజం కాకుండా మతోన్మాద రాజ్యం వచ్చిన తరుణంలో మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు.డివైఎఫ్ఐ ఓల్డ్ సిటీ కార్యదర్శి అంజి, నాయకులు నాని, ఇంతియాజ్, షాకీర్, ఈశ్వర్, మాజీ డివైఎఫ్ఐ నాయకులు నరసింహులు, ఎస్‌ఎండి షరీఫ్, మాబాష పాల్గొన్నారు.

ఆర్‌యు లో భగత్ సింగ్ జయంతి

కర్నూలు కలెక్టరేట్ : రాయలసీమ యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ వర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో శనివారం భగత్‌సింగ్ 117వ జయంతిని నిర్వహించారు. యూనివర్సిటీ కన్వీనర్ రామకృష్ణ, కో-కన్వీనర్ మౌలాలి, రాజు, సాగర్, నారాయణ, గణేష్, భరత్, లవకుమార్, జోష్ కుమార్, నవీన్, ప్రశాంత్, ప్రకాష్, భీమేష్, ప్రతాప్, యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్ : సర్దార్ షాహిద్ భగత్ సింగ్ 117వ జయంతి వేడుకలను కోడుమూరు ఎఐటియుసి కార్యాలయంలో ఎఐఎస్ఎఫ్-ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా భగత్ సింగ్ చిత్రపటానికి సిపిఐ మండల కార్యదర్శి బి.రాజు పూలమాల వేసి నివాళులు అర్పించారు.

మద్దికేర : భగత్‌సింగ్ జీవితం నేటి యువతకు ఎంతో స్ఫూర్తి దాయకమని ఆపద్బాంధవ సేవా సమితి అధ్యక్షులు చొక్కా సునీల్ కుమార్ తెలిపారు. మద్దికేరలో బఆయన వర్ధంతి సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువకులు విద్యార్థులు శాస్త్రీయ విద్యా విధానం కోసం, శాస్త్రీయ బద్ధంగా బతకడం కోసం, మూఢ త్వానికి వ్యతిరేకంగా పోరాడి నప్పుడే భగత్ సింగ్‌కు నిజమైన నివాళి అన్నారు.



రాయలసీమ విశ్వవిద్యాలయంలో

'జెమ్ కేర్ కామినేని'లో వరల్డ్ హార్ట్ డే

-అక్టోబర్ 27వరకు రాయతీ పరీక్షలు

-డాక్టర్ ఎస్‌వి.చంద్రశేఖర్, డాక్టర్ రాఘవేంద్ర వెల్లడి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు కొత్త బస్టాండులోని జెమ్ కేర్ కామినేని హాస్పిటల్‌లో వరల్డ్ హార్ట్‌డే సెలబ్రేషన్స్ శనివారం ఘనంగా నిర్వహించారు. విలేకరుల సమావేశంలో హాస్పిటల్ ఎండి, సిఇఒ డాక్టర్‌ఎస్‌వి. చంద్రశేఖర్, కార్డియాలజిస్ట్ డాక్టర్ రాఘవేంద్ర చెరుకూరి, సీటీ సర్జన్ డాక్టర్ సుధీర్ కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్మోహన్ రెడ్డి, డాక్టర్ మాధవి, డాక్టర్ ఆదిత్య, డాక్టర్ రవిబాబు, డాక్టర్ బాలమురళీ కృష్ణ, హాస్పిటల్ సిబ్బంది,డాక్టర్ గణేష్, సిఒఒ డిప్యూటీ జనరల్ మేనేజర్ నదీమ్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ డాక్టర్ కీన్ కౌల్ తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ ఎస్‌వి.చంద్రశేఖర్, డాక్టర్ రాఘవేంద్ర మాట్లాడుతూ 1972 నుంచి ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా ఈనెల 29న హార్ట్‌డే జరుపుకుంటారన్నారు. ఈ దినోత్సవం ప్రపంచ ఆరోగ్య సంస్థ, వరల్డ్ హార్ట్ ఫెడరేషన్‌లు సంయుక్తంగా నిర్వహిస్తాయిన్నారు. ఈ రోజున ప్రతి ఒక్కరు గుండె జబ్బులపై అవగాహన పెంచుకొని, గుండెజబ్బులు రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకోవాలన్నారు. తమ కాత్ల్యాబ్‌లో సాధించిన కొన్ని ఘనతల గురించి వారు చెప్పారు. కాంట్రాస్ట్ పిసిఐ (ఎకెఐ పేషంట్స్)కు ఐవియుఎస్ ద్వారా చికిత్స, రిటబ్లేషన్ మెథడ్‌ని క్యాల్సిఫైడ్ కరోనరీ ఆర్టరీస్ లో ఉపయోగించామని, లెఫ్ట్ బండల్ పర్మనెంట్ పేస్‌మేకర్ ఇంప్లాంటేషన్, పిబిఎంవి, మెకానికల్ త్రోమ్బెక్టమీ, రేనల్ ఆర్టరీ స్టెంటింగ్,ఐవియుఎస్ గైడెడ్ పిటిసిఎ (ఇంట్రా వ్యస్క్యులర్ అల్ట్రా సౌండ్), కరోటిడ్ అర్టరీ స్టెంటింగ్ ఇప్పటి వరకూ 958కిపైగా గుండెకి సంబదించిన కేసులు విజయవంతంగా చేశామని తెలిపారు. సెప్టెంబర్,27న తమ హాస్పిటల్‌లో దాదాపు 300మందికి స్క్రీనింగ్ చేసి గుండెకు సంబంధించిన పరీక్షలు రూ.9000 ఖర్చు కాగా...ఆ పరీక్షలను ఉచితంగా చేశామని చెప్పారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా స్పెషల్ ప్యాకేజీగా రూ.5250 విలువ గల పరీక్షలు కేవలం రూ.1499లకు చేయబోతున్నామని తెలిపారు. ఈ ఆఫర్ అక్టోబర్ 27 వరకు వుంటుందని పేర్కొన్నారు. సిఒఒ డాక్టర్ గణేష్, డిప్యూటీ జనరల్ మేనేజర్ నదీమ్ మాట్లాడుతూ రాబోయే కాలంలో సామాజిక స్వచ్ఛంద సేవాసంస్థలతో కలిసి కార్డియాక్ సంబంధించిన వ్యాధుల గురించి ఎన్నో ఫ్రీ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



-హార్ట్ డే సందర్భంగా జెమ్‌కేర్ కామినేనిలో కేక్ కట్ చేస్తున్న వైద్యులు

విద్యార్థులకు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఇండియా విజన్ ఇనిస్టిట్యూట్ ఎన్‌జిఒ చెన్నై వారు ఆపరేషన్ ఐ సైట్ యూనివర్సల్ వారి సౌజన్యంతో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉర్దూపాతబస్తీ కర్నూలులో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో విద్యార్థులకు కంటి విజన్ స్క్రీన్, కంటి పరీక్ష నిర్వహించి ఎవరికైతే దృష్టిలోపం ఉందో వారికి ఒక జత కంటి అద్దాలు ఉచితంగా పంపిణీ చేస్తామని ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్.నిరంజన్ గౌడ్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ మహేశ్వరి, డాక్టర్ అమీర్ ఖాన్, కంటి పరీక్షలు నిర్వహించి కంటి ఆరోగ్యం గురించి కంటి రక్షణ గురించి కంటికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించిన ఇండియా విజన్ ఇనిస్టిట్యూట్ ఎన్‌జిఒ చెన్నై , ఆపరేషన్ ఐ సైట్ యూనివర్సల్ వారి సేవలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని, బాల్యం నందే దృష్టిలోపం సరిదిద్దడం వల్ల బాలల భవిష్యత్తు బాగుంటుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.పుష్పరాజ్ , ఉపాధ్యాయులు పి.సుకూర్ ఎం.విజయకుమార్ తెలిపారు. వైద్య పరీక్షలు నిర్వహించినందుకు ధన్యవాదాలు తెలిపారు.



ఉచిత కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

విశ్వనరుడు జాషువా : కెవిపిఎస్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నవయుగ కవి చక్రవర్తి బిరుధాంకితుడైన విశ్వ నరుడు గుర్రం జాషువా 117వ జయంతిని కెవిపిఎస్ ఆధ్వర్యంలో కర్నూలు శ్రీరామ్‌నగర్ లో ఘనంగా నిర్వహించారు. ముందు యువ గాయకుడు గుర్రం మునిస్వామి చే ఆలపించిన సామాజిక గీతాలు వీధిలోని ప్రజలను ఆలోచింప చేయడమే గాక, విద్యార్థులు తోడుగా వచ్చి గొంతుకలిపేలా చేశాయి. అనంతరం మహాకవి గుర్రం జాషువాకు వీధి పెద్దలచే పూల మాల వేయించి ఘనంగా నివాళులు అర్పించారు. కెవిపిఎస్ శ్రీరామనగర్ వార్డు కార్యదర్శి బాబురావ్ అధ్యక్షతన జరిగిన జయంతి కార్యక్రమాన్ని ఉద్దేశించి కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. ఆనంద్ బాబు, మాజీ నగర కార్యదర్శి ఆర్.నరసింహులు, కర్నూలు న్యూ సిటీ కార్యదర్శి ఎం. భాస్కర్ మాట్లాడారు. కులాంతర వివాహం చేసుకున్న యాదవ, మాదిగ సామాజిక తరగతుల ముద్దుబిడ్డగా 1895లో ఈ భూమిపై అడుగు పెట్టిన జాషువా బాల్యం మినహా మిగతా జీవితమంతా కష్టాల సుడిగుండంతో పాటు అంటరాని వాడుగా అనేక రకాల అవమానాలను ఎదుర్కొన్నారన్నారు. జ్ఞానం అన్నది ఏ ఒక్కడి సొత్తు కాదని, తన జ్ఞాన సంపద ద్వారా ప్రపంచానికి చాటి చెప్పిన జాషువా మనకు ఆదర్శం అన్నారు. మతములన్నియు మాసిపోవును మంచి ఒక్కటే నిలిచి యుండును అన్న విశ్వనరుడు జాషువా స్ఫూర్తిని కొనసాగిద్దామన్నారు. అందమైన చందమామ, రామచిలుక, బుల్‌బుల్ పిట్ట లాంటి సున్నితమైన అందానికి పేరెన్నికగన్న వాటిని మిగిలిన కవులు కథా వస్తువులుగా తీసుకుంటే.. పాడుబడ్డ బవంతులలో వేలాడే గబ్బిలాన్ని తన కథ వస్తువుగా స్వీకరించి, గుడిలోకి వెళ్లలేని వాడి బాధను పూజారి లేని సందర్భంలో చాటుగా తమ బాధ ఆపరమ శివుడికి చెప్పమనే ఇతివృత్తం ప్రతి మనిషిని ఆలోచింప చేస్తుందన్నారు. ఇదేగాక ఫిరదౌషి, ఖాందీషీకుడు, ముంతాజ్ మహల్, యేసు చరిత్ర లాంటి ఎన్నో ఖండ కా వ్యాలను రచించారన్నారు. కాదన్న వారిచేతే గండెపెండేరాన్ని తొడిగించుకుని ఏనుగుపై ఎక్కించి ఊరేగించబడ్డ గొప్ప కవి జాషువా అన్నారు. కుల మతాలకతీతంగా ప్రజలు ఐక్యంగా ఉండాలని కోరుకున్నా రన్నారు. జాషువా స్ఫూర్తితో సామాజిక చైతన్య కార్యక్రమాలను మరిన్ని నిర్వహిద్దామని పిలుపు నిచ్చారు.ెకవిపిఎస్ వార్డు అధ్యక్షులు జాన్సన్, ఉపాధ్యక్షులు ఆంజనేయులు, నాగరాజు, సవారన్న, తదితరులు పాల్గొన్నారు.



గేయాలను ఆలపిస్తున్న గుర్రం మునిస్వామి, ఆనంద్‌బాబు, తదితరులు



హోమ్ ఆఫ్‌హోప్ అనాథాశ్రమానికి నిత్యవసర వస్తువులు ఇస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

ప్రతి ఒక్కరూ సామాజిక సేవకు వినియోగించాలి

హోమ్ ఆఫ్ హోప్ అనాథాశ్రమానికి నిత్యవసర వస్తువులు ఇచ్చిన డాక్టర్ శంకర్‌శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో ఎంతో కొంత భాగాన్ని సామాజిక సేవకు వినియోగించాలని సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్‌శర్మ అన్నారు. కర్నూలు నగర శివారులోని జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఉన్న హోమ్ ఆఫ్‌హోప్ అనాథాశ్రమానికి నెల రోజులకు సరిపడా నిత్యవసర వస్తువులను ఆయన అందజేశారు. ఆశ్రమ నిర్వాహకులు బ్లెస్సీ తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సొంత లాభాన్ని కొంత మానుకొని పొరుగు వారికి సాయం చేయాలన్న సూక్తిని పాటించాలని సూచించారు.అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలను నిర్వాహకులు ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి నిర్వహిస్తుంటారన్నారు. అలాంటివారికి ఏదో ఒక రకంగా ప్రతి ఒక్కరూ సహాయం అందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. కృత్రిమ మేధస్సు కీలకపాత్ర పోషిస్తున్న 21వ శతాబ్దంలో కూడా ఆడపిల్లల పట్ల వివక్ష కొనసాగుతూ ఉండడం దురదృష్టకరమన్నారు. సమాజంలో బాలికా విద్యను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతో ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరు మంచితనమే మానవత్వం అన్న నానుడిని పాటించాలని సూచించారు. సంవత్సరంలో రెండు మూడు సార్లు అయినా ఈ అనాథాశ్రమానికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. అనాథాశ్రమంలోని చిన్నారులకు ఆరోగ్య సమస్యలు ఏమైనా వస్తే తనను సంప్రదించాలని నిర్వాహకురాలు బ్లెస్సీకి సూచించారు. తన వంతు బాధ్యతగా ఇలాంటి కార్యక్రమాల ద్వారా సామాజిక సేవలో పాల్గొంటున్నానని డాక్టర్ శంకర్ శర్మ తెలిపారు.

శ్రీ శంకరాస్ డిగ్రీ కాలేజీలో ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

శ్రీ శంకరాస్ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డేను కళాశాల డైరెక్టర్ డాక్టర్ బి.హరికిషన్ ఆధ్వర్యంలోఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి కళాశాల డైరెక్టర్ బి.హరికిషన్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను ఎంచుకొని ఉన్నతమైన హోదాను పొందాలన్నారు. తమ తల్లిదండ్రులకు తాము చదివిన పాఠశాల, కళాశాలలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకుంటే ఉన్నతమైన శిఖరాలను అధిరోధిస్తారని తెలిపారు. అనంతరం అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసులు, అకాడమిక్ అడ్వైజర్ వసంత కుమారి, వైస్ ప్రిన్సిపల్ బి.మద్దిలేటి , ఇతర అధ్యాపకులు , విద్యార్థులు పాల్గొన్నారు.



హరికిషన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న విద్యార్థిని

స.హ చట్టంపై అవగాహన అవసరం

- ఎడిఎ సునీత


మాట్లాడుతున్న సునీత

ప్రజాశక్తి - ఆలూరు

సమాచార హక్కు చట్టంపై అందరూ అవగాహన కలిగి ఉండాలని ఆలూరు ఎడిఎ సునీత తెలిపారు. శనివారం వ్యవసాయ కార్యాలయంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది, మండల వ్యవసాయ శాఖ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 2005(1)(బి) సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రభుత్వ శాఖ పరిధిలోని ప్రతి సమాచారాన్ని రాతపూర్వకంగా ప్రజలు ఏవరైనా అడిగే హక్కు ఉందని తెలిపారు. ఆయా సమాచారాన్ని 30 రోజుల వ్యవధిలో అందించాలని చెప్పారు. ఆ సమాచారం నిర్ణీత సమయంలో అందించకపోతే ఉన్నతాధికారికి అప్పీల్ చేసుకుంటారన్నారు. ఉన్నతాధికారుల చర్యలకు పాల్పడక ముందే కోరిన సమాచారాన్ని నిర్ణీత సమయంలో అందించాలని తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- ట్రాఫిక్ సిఐ గంటా సుబ్బారావు

ప్రజాశక్తి - ఆదోని

మత్తు పదార్థాలకు అలవాటు పడి భవిష్యత్తును అంధకారం చేసుకోరాదని ఆదోని ట్రాఫిక్ సిఐ గంటా సుబ్బారావు తెలిపారు. శనివారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లలకు విద్యాబుద్ధులు చెప్పించేందుకు కళాశాలకు పంపుతారన్న నిజాన్ని విద్యార్థినులు తెలుసుకోవాలని అన్నారు. కళాశాలలో ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, మాదకద్రవ్యాలకు తావు లేదన్నారు. సోషల్ మీడియా ప్రభావం చాలా ఉందని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని తెలిపారు. అలాంటి అలవాట్లు ఉన్న వారి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సంజన్న, గ్రంథాలయ అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గోవిందరాజులు, ఎఎస్ఐ లక్ష్మయ్య, వేదవతి, ఈరన్న ఉన్నారు.

ఉన్నత స్థాయికి ఎదగాలి

- ప్రిన్సిపల్ డాక్టర్ జ్ఞానేశ్వర్

ప్రజాశక్తి - ఆలూరు

జీవితంలో ప్రతి ఒక్కరూ ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జ్ఞానేశ్వర్ తెలిపారు. శనివారం కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులను సీనియర్ విద్యార్థులు స్వాగతం (ఫ్రెషర్స్ డే) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈఏడాది బిఎతోపాటు బికాం ప్రారంభించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సాధనతో భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరిస్తూ ఉత్తేజాన్ని కలిగించాయి. అధ్యాపకులు మాధవి, సుశీల, లక్ష్మీనరసమ్మ, రాఘవేంద్ర, ముద్దప్ప, శేఖర్, ప్రణయ్ పాల్గొన్నారు.

వైఎస్ఆర్ విగ్రహాన్ని కూల్చేసిన దుండగులు

- పోలీసు స్టేషన్‌లో వైసిపి నాయకుల ఫిర్యాదు

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని బాపులదొడ్డి గ్రామంలోని కోసిగి రహదారిలో ఏర్పాటు చేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు శనివారం కూల్చేశారు. వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రవి చంద్రారెడ్డి, మాజీ ఎంపిపి రఘురామ్‌లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

- సర్పంచి ప్రేమ్ కుమార్


రహదారిని చదును చేయిస్తున్న సర్పంచి

ప్రజాశక్తి - చిప్పగిరి

గ్రామంలో మౌలిక వసతులకు, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని సర్పంచి ప్రేమ్ కుమార్ తెలిపారు. శనివారం నేమకల్లు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి స్థానిక బస్టాండ్ వరకు గుంతలు పడి అధ్వానంగా ఉన్న రహదారికి పంచాయతీ నిధులతో గ్రావెల్ వేయించి చదును చేయించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోడ్డు అధ్వానంగా ఉండడంతో ప్రయాణికుల ఇబ్బందులు, విద్యార్థులు సైకిల్‌పై వచ్చేటప్పుడు పడుతున్న ఇబ్బందులు చూసి వెంటనే స్పందించినట్లు తెలిపారు. పాఠశాల ఆవరణ ముందు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తున్నానన్నారు. శుద్ధజల కేంద్రం దగ్గర నీరు నిల్వ లేకుండా డ్రెయినేజీ కాలువలు ఏర్పాటు చేశామని తెలిపారు. రాములమ్మ దేవాలయం దగ్గర గ్రావెల్ కూడా వేయించామన్నారు. సిసి రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని తెలిపారు. గ్రామ పెద్దలు సత్తిరెడ్డి, నెట్టికల్లు, రాంపురి, ఈరన్న, రంగన్న పాల్గొన్నారు.

మీనాక్షి నాయుడు బంధువులైతే

నాణ్యత పాటించరా..?

- ఎమ్మెల్యే పార్థసారథి - ఎమ్మెల్యేను చుట్టుముట్టిన టిడిపి శ్రేణులు
- అన్న క్యాంటీన్ల మరమ్మతు బిల్లుల జాప్యంపై మండిపాటు
- ఎమ్మెల్యే, అధికారులతో వాగ్వాదం

ప్రజాశక్తి - ఆదోని

మీనాక్షి నాయుడు బంధువులయితే నాణ్యత పాటించరా, అన్న క్యాంటీన్లను పరిశీలించే బిల్లుకు సంబంధించిన అంశాన్ని అజెండాలో పెడతామని ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్మన్ శాంత అధ్యక్షతన టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల అవగాహన కార్యక్రమం జరిగింది. సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ హాజరయ్యారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో టిడిపి నాయకులకు, అధికారులకు రగడ సాగింది. సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే పార్థసారథి, సబ్ కలెక్టర్ భరద్వాజ్, మున్సిపల్ కమిషనర్ కృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, ఇంజినీరింగ్ శాఖ అధికారులతో టిడిపి నాయకులు రంగస్వామి నాయుడు, వెంకటేష్ చౌదరి, బుద్ధారెడ్డి, తిమ్మప్ప, లక్ష్మీనారాయణ, వెంకటేష్ వాగ్వాదానికి దిగారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో ప్రతిష్టగా తీసుకున్న అన్న క్యాంటీన్ల క్రమబద్ధీకరణ పనులు చేపట్టాలని టెండర్లు పిలిస్తే తాము అప్పులు చేసి, భార్య, పిల్లల బంగారం తాకట్టు పెట్టి రూ.లక్షలతో పనులు చేపట్టామని టిడిపి నాయకులు తెలిపారు. పనులు ఆగమేఘాల మీద పూర్తి చేస్తే బిల్లులు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని నిలదీశారు. కౌన్సిల్ సమావేశం అజెండాలో బిల్లుల తీర్మానం తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. తమకు ఇంత అన్యాయం చేస్తే ఎలా అని నిలదీశారు. అలాగే గత నాలుగు నెలలుగా మున్సిపల్ కమిషనర్‌కు, ఇంజినీరింగ్ అధికారికి రెండు వాహనాలను తాము అద్దెకు పెడితే వాటి బిల్లులు కూడా చేయలేదని ప్రశ్నించారు. తమను ఎందుకు వేధిస్తున్నారని, టిడిపి ప్రభుత్వంలో టిడిపి కార్యకర్తలను వేధిస్తే ఎలా అని నిలదీశారు. అన్న క్యాంటీన్ బిల్లుల విషయంలో నాణ్యత లేదని, వాటిని పరిశీలించే బిల్లు పెట్టాలని ఫిర్యాదులు రావడంతో మరో సమావేశంలో పెట్టాలని, ఈ సమావేశంలో పెట్టలేదని కమిషనర్ కృష్ణ సమాధానం ఇచ్చారు. నిధులు ఇచ్చేది ప్రభుత్వమని, మున్సిపల్ అధికారులు కేవలం బిల్లులు చేసి పంపాలని, ఇలా నాణ్యత పేరుతో వేధించడం తగదని టిడిపి నాయకులు వారించారు. అజెండాలో బిల్లులను పెట్టే వరకు కదిలేది లేదని కౌన్సిల్ హాలులో బైఠాయించారు. కమిషనర్‌కు, మున్సిపల్ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ సోమన్న, సిఐ శ్రీరామ్ అక్కడికి చేరుకుని ఆందోళన విరమింపచేసేందుకు ప్రయత్నించారు. మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు తనయుడు భూపాల్ చౌదరి కార్యాలయం వద్దకు చేరుకుని మున్సిపల్ కమిషనర్‌తో చర్చించి ముందుగా తీర్మానం చేయాలని, ఆ తర్వాత విచారణ చేసుకోవాలని సూచించారు. కమిషనర్ ఇందుకు ఒప్పుకోవడంతో ఆందోళన విరమించా రు. అనంతరం ఎమ్మెల్యే పార్థసారథి ప్రత్యేకంగా విలేకరులతో మాట్లాడారు. టిడిపి అంటే మీనాక్షి నాయుడు గ్రూపు మాత్రమే కాదని, భయపెట్టాలని చూస్తే తాను భయపడనని తెలిపారు. ప్రజలకు జవాబుదారితనంగా ఉంటానని ఎమ్మెల్యే తేల్చి చెప్పారు.


ఎమ్మెల్యేను చుట్టుముట్టిన టిడిపి నాయకులు


బైఠాయించిన టిడిపి నాయకులు

వీరభద్ర గౌడ్‌తోనే మండలాభివృద్ధి

- దేగులపాడు సర్పంచి నీలకంఠ

ప్రజాశక్తి - చిప్పగిరి



మండలంలోని ప్రతి గ్రామమూ అభివృద్ధి చెందాలంటే టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్‌తోనే సాధ్యమవుతుందని దేగులపాడు సర్పంచి నీలకంఠ తెలిపారు. శనివారం ఆయన చిప్పగిరిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఐదేళ్లుగా గ్రామాల్లో చిన్న, చిన్న అభివృద్ధి పనులు కూడా చేసుకోలేకపోయామని తెలిపారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ సహకారంతో అభివృద్ధి అంటే ఏంటో ప్రతిపక్షాలకు చేసి చూపిస్తామన్నారు. ఎమ్మెల్యే ప్రతిసారీ 'లడ్డు'పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురించి స్థాయి మరిచి మాట్లాడడం మంచిది కాదన్నారు. తాము కూడా మాట్లాడగలమని, అది ఎంతవరకు ఉండాలో అంతవరకే ఉండాలని హితవు పలికారు. పూర్తి అవగాహన లేక ఏదో ఒక విషయం మాట్లాడి చులకన కావద్దని తెలిపారు.

బాధితులకు వైసిపి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పెద్దకడబూరు

అగ్ని ప్రమాదం సర్వం కోల్పోయిన పెద్దకడబూరుకు చెందిన మంచోది శాంతిరాజు కుటుంబానికి వైసిపి నాయకులు శనివారం ఆర్థిక సహాయం అందజేశారు. వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి రూ.10 వేలు, మాజీ ఎంపిపి రఘురామ్ రూ.2,500, దొడ్డిమేకల సర్పంచి చంద్రశేఖర్ రూ.2 వేల ఆర్థిక సహాయం అందజేశారు. వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రవి చంద్రారెడ్డి, విజయేంద్ర రెడ్డి, ముక్కరన్న, అర్లప్ప పాల్గొన్నారు.

వాటర్ షెడ్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - హాలహర్వి

హాలహర్వి మజరా గ్రామమైన మాచనూరులో వాటర్ షెడ్ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ప్రాజెక్టు ఆఫీసర్ వలీ బేగ్ తెలిపారు. శనివారం మాచనూరు గ్రామంలో మల్లికార్జున ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకొని వారికి పూలమాలలతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గతంలో ఉన్న కమిటీని తొలగించి నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. గ్రామంలోని రైతులకు మంచి పనులు చేసి ఈ కమిటీకి మంచి పేరు తేవాలని చెప్పారు. గ్రామ వాటర్ షెడ్ కమిటీ ఛైర్మన్‌గా కుబేర, వైస్ ఛైర్మన్‌గా నారాయణమ్మ, మరో 11 మంది సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు. పురుషోత్తం రెడ్డి, టిఆ గోవిందు, టిడిపి మండల కన్వీనర్ సుధాకర్, క్లస్టర్ ఇన్‌ఛార్జీ పాల్ రెడ్డి, హరిరెడ్డి పాల్గొన్నారు.

జగన్మోహన్ రెడ్డికి మతిభ్రమించింది

- జనసేన తాలూకా నాయకులు నాగరాజు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి మతిభ్రమించిందని జనసేన పార్టీ తాలూకా నాయకులు బీసీ.నాగరాజు విమర్శించారు. శనివారం పట్టణంలోని మండల కార్యాలయ ఆవరణలో ఆయన మాట్లాడారు. వైసిపి నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను విమర్శించే నైతికతను కోల్పోయారని పేర్కొన్నారు.



భగత్ సింగ్ ఆశయాలు సాధిస్తాం

- యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు నాగమణి - ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

భగత్ సింగ్ ఆశయాలు సాధించడానికి విద్యార్థులు, యువత ముందుకు రావాలని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు నాగమణి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ కోరారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భగత్ సింగ్ జయంతి నిర్వహించారు. ముందుగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు రాము అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. భగత్ సింగ్ చిన్ననాటి నుంచే బ్రిటీష్ ప్రభుత్వంపై అవగాహన చేసుకుని తిరుగుబాటు చేశారని తెలిపారు. ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలపై ఆయన స్ఫూర్తితో పోరాటాలు చేయాలని కోరారు. డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేష్, విద్యార్థులు ఈరమ్మ, సౌమ్య, లక్ష్మి, సువర్ణ పాల్గొన్నారు. **నందవరం**లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు శివరామ్, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు ఎల్లప్ప, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప, పాఠశాల ఉపాధ్యాయులు భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు ప్రసాద్, పరమేష్, ఈరన్న, హనీఫ్, కేశవయ్య, కోటేశ్వర ఆచారి, ఎస్ఎఫ్ఐ నాయకులు రాము, నితీష్, దివ్యరాజు పాల్గొన్నారు. **ఆస్పరి** మండలంలోని పుప్పాల దొడ్డి, ములుగుందం, కైరుప్పల, బిల్లేకల్లు గ్రామాల్లో ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి రమేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి రంగప్ప, నాయకులు వీరేష్, బ్రహ్మయ్య, దస్తగిరి, రేవన్, రఘు పాల్గొన్నారు. **ఆలూరు** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భగత్ సింగ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డివైఎఫ్ఐ జిల్లా నాయకులు గోవర్ధన్ అధ్యక్షత వహించారు. డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మైనా, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి గిరిమూర్తి, మండల నాయకులు బసవరాజు, అకీర్, రాజశేఖర్ పాల్గొన్నారు. **హాలహర్వి** మండలంలోని చింతకుంట గ్రామంలో ఉన్న ఉన్నత పాఠశాలలో భగత్ సింగ్ చిత్రపటానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున గౌడ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గిరిమూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు చమురుద్దీన్, శ్రీనివాసులు, తేజ, ఎస్ఎఫ్ఐ నాయకులు హనుమంతు, ఖాజా, యశ్వంత్, దాదు, మంజునాథ్ పాల్గొన్నారు. **కౌతాళం** మండలంలోని ప్రతిభ ఉన్నత పాఠశాలలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాష, ప్రధానోపాధ్యాయులు జ్ఞానేశ్వరి, పాఠశాల సెక్రటరీ మైనుద్దీన్ పాల్గొన్నారు. **దేవనకొండ**లో డివైఎఫ్ఐ మండల కార్యదర్శి కె.శ్రీనివాసులు అధ్యక్షతన నివాళులర్పించారు. డివైఎఫ్ఐ మండల సహాయ కార్యదర్శి చిన్న వీరేంద్ర నాయుడు, నాగరాజు, డివైఎఫ్ఐ నాయకులు నాని, వీరప్ప, చిన్న, రంగస్వామి, నాయుడు, పాల్గొన్నారు. **మంత్రాలయం**లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథులుగా ఎంఇఒ మోహినుద్దీన్, కళాశాల ప్రిన్సిపల్ రమేషాచార్ హాజరయ్యారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి థామస్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు రాజు పాల్గొన్నారు.


ఎమ్మిగనూరులో నివాళులర్పిస్తున్న నాయకులు


నందవరంలో నివాళులర్పిస్తున్న నాయకులు


ఆలూరులో నివాళులర్పిస్తున్న నాయకులు



హాలహర్విలో బహుమతులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు


కౌతాళంలో నివాళులర్పిస్తున్న నాయకులు


ఆస్పరిలో నివాళులర్పిస్తున్న నాయకులు

కల్తీ నెయ్యి కొనుగోలుతో

రూ.10 కోట్ల మింగేశారు..?

- టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం




తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగిన కల్తీ నెయ్యి కొనుగోలుతో గత ప్రభుత్వం రూ.10 కోట్లు మింగేసినట్లు తెలుస్తోందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని మాధవరం గ్రామంలోని ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. టిటిడి ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో గతేడాది 11,329 కిలోల బంగారం ఉందని, ప్రస్తుతం 13 వేల టన్నులు కూడా ఉండవచ్చని అంచనా వేశారు. ఇక వెండి అయితే లెక్కే లేదన్నారు. నగదు రూపంలో రూ.80 వేల కోట్లకు పైగానే ఉంటుందని చెప్పారు. సంవత్సరానికి రూ.వెయ్యి కోట్ల కంటే ఎక్కువ హుండీ ఆదాయం వివరాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆలయ నిర్వహణకు ఏడాదికి రూ.5 వేల కోట్లు బడ్జెట్ ఉందని తెలిపారు. ఇవన్నీ పక్కన పెడితే ఒక్క రోజుకు 3.5 లక్షల లడ్డులు తయారవుతున్నాయని చెప్పారు. అందులో నెయ్యికి బదులు కల్తీ నెయ్యి వాడి రూ.10 కోట్లు మింగేయడానికి ఇలాంటి దిక్కు మాలిన పని చేశారని విమర్శించారు. ఈ కల్తీ చేసింది లడ్డూ తయారీలో మాత్రమే కాకుండా మిగిలిన ప్రసాదంలో కూడా చేశారా అని అనుమానం కలుగుతోందని తెలిపారు. రూ.10 కోట్ల మింగేయడానికి సిబ్బందిని కూడా మార్చేశారని విమర్శించారు. ఈ అంశంపై కూటమి ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసి విచారణ చేపట్టిందని తెలిపారు. భక్తుల నమ్మకంతో, మనోభావాలతో ఆడుకోవద్దని, అలాంటి వారు ఈ ప్రభుత్వంలో శిక్ష అనుభవించక తప్పదని హెచ్చరించారు. నిత్యాన్నదానం చేసే కార్యక్రమంలో 160 గ్రాములు ఉన్న లడ్డును 90 గ్రాములకు కుదించి, అందులోనూ కల్తీ చేసిన ఘనత జగన్ రెడ్డికి దక్కిందన్నారు.

'లడ్డు'పై తప్పుడు ప్రచారం

- ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి - ఆలూరు

తిరుపతి వెంకటేశ్వర స్వామి లడ్డు ప్రసాదంపై చంద్రబాబు నాయుడు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి మండిపడ్డారు. శనివారం ఆలూరులోని సాయిబాబా ఆలయం, బెల్లిగుండు ఆంజనేయస్వామిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యి ఉందని దుష్ప్రచారం చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీసి మతవిద్వేషాలను రెచ్చగొట్టే విధంగా కూటమి నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కల్తీపై అనుమానాలుంటే దర్యాప్తు చేపట్టాలి కానీ రాజకీయం చేయడం ఆయన స్థాయికి తగదన్నారు. **పెద్దకడబూరు** మండలంలోని తారాపురం గిడ్డాంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి మాట్లాడారు. నిపుణుల కమిటీ కల్తీ జరగలేదని చెప్పినా కూటమి నేతలు పదేపదే ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలను తప్పుదోవ పట్టించడానికే ఇలాంటి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని తెలిపారు. వైసిపి నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపిపి రఘురాం, నాయకులు రవిచంద్రారెడ్డి, శివరామిరెడ్డి, రాజశేఖర రెడ్డి, విజయేంద్ర రెడ్డి, చంద్రశేఖర్, ముక్కరన్న, అర్లప్ప, పూజారి ఈరన్న పాల్గొన్నారు. **ఆదోని (రూరల్)** మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో శ్రీగర్జిలింగేశ్వర స్వామి ఆలయంలో వైసిపి సీనియర్ నాయకులు మెడికల్ నాగరాజ్, హనుమంతప్ప, గర్జప్ప, కర్రెప్ప, మల్లిరెడ్డి, బండి తిమ్మప్ప ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిద్ధప్ప, కుప్పలదొడ్డి మార్లింగప్ప, మల్లప్ప, మీసేవ నాగరాజ్, గోరవ పంపన్న, పరమేష్, తిప్పన్న, చంద్రారెడ్డి, రవి, కపటి రంగస్వామి, లింగన్న, నాగరాజు, హుస్సేని పాల్గొన్నారు. **మంత్రాలయం**లోని వెంకటేశ్వర ఆలయం సన్నిధిలో వైసిపి నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వై.బాల నాగిరెడ్డి, రాంపురం రెడ్డి సోదరుల ఆదేశాల మేరకు శ్రీవెంకటేశ్వర స్వామికి పూజలు నిర్వహించారు. వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, మండల ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, ఉప సర్పంచులు హోటల్ పరమేష్, వీరనాగప్ప, ఎంపిటిసి సభ్యులు వెంకటేష్ శెట్టి, గోరుకల్లు కృష్ణస్వామి, శివ కుమార్ పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలోని అన్నమయ్య సర్కిల్‌లో వెంకటసాయి దేవాలయంలో పూజలు చేశారు. వైసిపి యువ నాయకులు బుట్టా ప్రతుల్, వీరశైవ లింగాయత్ రాష్ట్ర అధ్యక్షులు వై.రుద్రగౌడ్, మండల కన్వీనర్ బిఆర్.బసిరెడ్డి, కనకవీడు లక్ష్మి కాంత్ రెడ్డి, మండల కన్వీనర్ శివారెడ్డి గౌడ్, ముగతి విరుపాక్షి రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్, గడ్డం నారాయణరెడ్డి, టౌన్ బ్యాంకు మాజీ ఛైర్మన్ కొమ్ము రాజు, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ ఎస్‌బి.మన్సూర్ పాల్గొన్నారు. **కౌతాళం**లోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో పూజలు చేశారు. వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి, మాజీ సర్పంచి అవతారం, వెంకట్రామిరెడ్డి, సర్పంచి పాల్ దినకరన్, వైస్ సర్పంచి తిక్కయ్య, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, నాయకులు నరసింహారెడ్డి, రౌడూరు సోమిరెడ్డి, పూజారి లింగన్న, లక్ష్మన్న, హుస్సేని, బసప్ప గౌడ్, అబ్దుల్ సమద్, బ్యాంక్ మహ్మద్ పాల్గొన్నారు.


ఆలూరులో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి


పెద్దకడబూరులో మాట్లాడుతున్న నాయకులు


ఆదోనిలో మాట్లాడుతున్న నాయకులు


మంత్రాలయంలో మాట్లాడుతున్న నాయకులు


ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న నాయకులు


కౌతాళంలో మాట్లాడుతున్న నాయకులు

మహనీయుల గురించి అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - ఆదోని

సమాజం మేలుకొలుపు కోసం ఎన్నో రచనలు చేసిన మహనీయుల గురించి విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ నెహ్రూ మెమోరియల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు అలీం సిద్దిక్ తెలిపారు. నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా 129వ జయంతి సందర్భంగా నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ పోటీల్లో 80 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలలో ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు సాహిత్య పుస్తకాలను బహుమతులుగా అందించినట్లు చెప్పారు. అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు కె.ప్రహ్లాద్ మాట్లాడుతూ... గుర్రం జాషువా రాసిన 'గబ్బిలం' కావ్యం ఆనాటి సామాజిక పరిస్థితులకు అద్దం పడుతుందని తెలిపారు. విద్యార్థుల బహుమతులకు ఉపాధ్యాయులు ప్రసాద్, సుధాకర్ బాబు, జాన్ విక్టర్ రాజు ఆర్థిక సహకారం అందించారు.

'కుంకునూరు'కు పెరిగిన ఆదాయం

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని కుంకునూరు పంచాయతీకి మార్కెట్ వేలం ద్వారా ఆదాయం పెరిగింది. శనివారం పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఇఒఆర్‌డి సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి సింగ్ ఆధ్వర్యంలో దేవనకొండ క్రాస్ రోడ్డు వద్ద ఉన్న మార్కెట్‌కు వేలంపాట నిర్వహించారు. ఈ వేలం పాటలు రూ.50 వేలు డిపాజిట్ చెల్లించిన ఐదుగురు వ్యక్తులు పాల్గొన్నారు. రూ.8.70 లక్షలకు వేలం పాట పాడి మార్కెట్ దక్కించుకున్నారు. గతేడాది రూ.5 లక్షలు మాత్రమే మార్కెట్ వేలం పోయిందని, ఈ ఏడాది రూ.3.70 లక్షల ఆదాయం పెరిగిందని ఇఒఆర్‌డి తెలిపారు.

30న చలో కలెక్టరేట్ : సిఐటియు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రభుత్వ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఈనెల 30న చేపట్టే చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని సిఐటియు తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు కోరారు. శనివారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. నాయకులు కె.ఇస్మాయిల్, నాగరాజు, రంగన్న గౌడ్, మునీంద్ర, జయన్న, దుర్గన్న, రంగస్వామి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మెళకువలతో అధిక దిగుబడులు

- 'పొలంబడి'లో శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు

ప్రజాశక్తి - చిప్పగిరి

వాతావరణానికి అనుగుణంగా పంటల మార్పిడి చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని, వ్యవసాయ శాఖ అధికారులు ఇచ్చే మెళకువలు తప్పనిసరిగా పాటించాలని శాస్త్రవేత్త రాఘవేంద్ర, డిఆర్‌సి ఎడిఎ వెంకటేశ్వర్లు, ఆలూరు ఎడిఎ సునీత తెలిపారు. శనివారం ఎఒ జయలక్ష్మి ఆధ్వర్యంలో నగరడోన గ్రామంలో 'పొలంబడి' నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రైతులతో సమావేశం నిర్వహించి అనేక సూచనలు చేశారు. పొలాల్లో పలు పంటలను పరిశీలించి మాట్లాడారు. ఎప్పటి నుంచో వస్తున్న పద్ధతులను వదిలి ఆధునిక పద్ధతులను అలవాటు చేసుకోవాలన్నారు. సేంద్రీయ ఎరువుల వాడకం, పంట మార్పిడి, మట్టి నమూనాలు ఆచరించాలని తెలిపారు.

గృహ నిర్మాణాల పెండింగ్ బిల్లులు మంజూరు : టిడిపి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రభుత్వ గృహ నిర్మాణాల పెండింగ్ బిల్లులు మంజూరయినట్లు టిడిపి పట్టణ ఇన్‌ఛార్జీ బి.వరదరాజులు తెలిపారు. శనివారం స్థానిక జగనన్న కాలనీలో 'మన ఇల్లు మన గౌరవం'లో ఆయన మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వంలో జగనన్న ఇంటి నిర్మాణాలు జరిగి పెండింగ్‌లో ఉన్న బిల్లులతో పాటు గత 2014లో ఎన్‌టిఆర్ గృహ నిర్మాణాల్లో పెండింగ్‌లో ఉన్న బిల్లులు ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. స్థానికంగా రెండు సచివాలయాల పరిధిలోని 318 మందికి లబ్ధి చేకూరిందని చెప్పారు. టిడిపి నాయకులు అశోక్ రెడ్డి, మేకల నరసింహ, శివ, రాజు, హౌసింగ్ డిఇ లాలీ కృష్ణయ్య, సచివాలయ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR NALGONDA DISTRICT AT NALGONDA.
A.A.C.F.NO/MNL/NLG/ 228 of 2024
Between:-
M/s. KAPIL CHITS (KOSTA) PVT. LTD. Nalgonda Branch, Represented by its Legal Officer M.Narsimha Raju, S/o. Pichaiah, Age about 39 years, R/o. Nalgonda town and District.
...Plaintiff/Disputant/Petitioner,
AND
1. Arachana Travels, its rep by Baddam Bhoja Reddy, S/o. Bhuma Reddy, Age about 42 years, Occ: Business, O/o. Plot No. 28 & 29, Siri Nagar, Opp Siris, Main Road, L.B.Nagar, Saroor Nagar, Hyderabad, Rangareddy District-500074.
2. Yelmati Chandra Reddy, S/o. Penta Reddy, Age about 53 years, Occ: Sr Asst, R/o. H.No.1-102, Pupalagudu, Rajendranagar,Rangareddy District-500089.
3. Mudireddy Niranjan Reddy, S/o. Veera Reddy, Age about 49 years, Occ: Teacher, R/o. Khethepally Village & Mandal, Nalgonda District-508211.
4. Mittapally Srinivas, S/o. Satyanarayana, Age about 56 years, Occ: Pvt Employee, R/o. H.No.11-14-26/H10/203, Chitra Layout, LB Nagar Saroor Nagar, Rangareddy Dist-500074.
5. Chintanar Hanmandlu, S/o.Rajaram, Age about 30 years, Occ: Business,R/o. H.No. 12-11-1492, Budha Nagar, Varasiguda, Secendrabad, Hyderabad-500061.
6. Vanapally Bal Reddy, S/o. Papi Reddy, Age about 48 years, Occ: Pvt Employee, R/o.H.No. 11-14-519, Near DVM College, Chintalkunta, LB Nagar, Hyderabad-500074.
7. Sarraf Ramesh, S/o. Vijayababu, Age about 35 years, Occ: Business, R/o. H.No.4-7, Main Road, Thimmajipet Post & Mandal, Karnool District-509209.
...Defendants/Opponents/Respondents.
Where As the above named disputant has made an application for reference of the dispute with regard to non payment of subscription u/s 32 of Chit Fund Act 1982, and Demand for consolidated payment of future subscriptions with interest U/s 33 of Chit Fund Act, 1982, for the chit series TNAT02R Ticket No.07 Which was sanctioned bearing prior sanction order No. Vide PSC No.334/2018 and date on 287-12-2018 to be examined under the provisions of Section 64 of Chit Funds Act, 1982. As on the date of filing disputed Claim is Rs.**3,01,993-00.**
You are hereby directed to appear before the Deputy Registrar of Chits/Arbitrator, Nalgonda District Register Office Municipal Complex, Nalgonda town and District, in person duly on Dt. **09-10-2024** At 11-00 A.M., in to show cause why the application should not be complied with that we may cause for to be done.
Please take notice that if no appearance is made on the above mentioned date and time and no counter is filed, the case will be disposed on its merits as exparte.
DEPUTY REGISTRAR OF CHITS ARBITRATOR NALGONDA DISTRITCT DISTRICT REGISTAR OFFICE MUNCIPAL COMPLEX NALGONDA.